క్లుప్తంగా

ప్రమాదంలో పశుగ్రాసం, ట్రాక్టర్ ట్రాలీ దగ్ధం



నడికూడ : మండలంలోని నర్సక్కపల్లె గ్రామంలో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటు చేసుకుని పశుగ్రాసం, ట్రాక్టర్ ట్రాలీ దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. నర్సక్కపల్లె ఉపసర్పంచ్ నాగుర్ల ధర్మారావు పంట పొలం నుంచి ట్రాక్టర్‌లో ఎండుగడ్డిని తన ఇంటికి తరలిస్తుండగా గ్రామ పంచాయతీ వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి నిప్పంటుకుంది. దీంతో మంటలు వ్యాపించాయి. స్థానికులు సమాచారం అందించడంతో పరకాలలోని అగ్నిమాపక కేంద్ర సిబ్బంది రంగంలోకి దిగి మంటలు ఆర్పేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. కాగా పశుగ్రాసంతోపాటు ట్రాక్టర్ ట్రాలీ దగ్ధమైంది.

‘డ్రంకెన్ డ్రైవ్’లో ముగ్గురికి జైలు

ఆత్మకూరు : మద్యం తాగి వాహనం నడిపిన ముగ్గురికి న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు సీఐ కుమార్ తెలిపారు. ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా చల్లా శ్రీకాంత్, గుండెబోయిన శివకుమార్, సర్వరాజ్ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్లు సీఐ తెలిపారు.

పిడుగుపాటుకు దుక్కిటెద్దు మృతి



దామెర : పిడుగుపాటుకు దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తుత్తురు రాజమౌళి తన దుక్కిటెద్దులను వ్యవసాయ పొలం వద్ద మేత కోసం వదలగా అకస్మాత్తుగా కురిసిన చిరుజల్లులతోపాటు ఉరుముల మెరుపులు తోడై పిడుగు పడింది. దీంతో దుక్కిటెద్దు అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సుమారు రూ.60 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు రాజమౌళి కన్నీరుమున్నీరుగా విలపించాడు.

సీపీఐ నేతలపై కేసు నమోదు

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలోని ఆర్‌ఆర్‌గార్డెన్‌లో అనుమతి లేకుండా సీపీఎం నేతలు పుచ్చలపల్లి సుందరయ్య సంతాప సభను శుక్రవారం నిర్వహించటమే కాకుండా రోడ్డుపై వాహనాలు పార్కు చేశారు. ఈ క్రమంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్పించారని సీపీఎం నేతలు మాలోతు సాగర్, జిల్లా అధ్యక్షుడు రంగయ్య, పలువురు నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాంబయ్య శనివారం తెలిపారు.

పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ



శాయంపేట : ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన కార్యక్రమాన్ని మండల కేంద్రంలో జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు దాసరి నరేష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాగృతి యువత రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముల్కనూరు మోహన్, సాయి, పవన్, నవీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా హోంలో అన్నదానం

కాశిబుగ్గ: సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా సొసైటీకాలనీలోని మదర్ థెరిస్సా అనాథాశ్రమంలో శనివారం వేడుకలు నిర్వహించినట్లు వరంగల్ డిస్ట్రిక్ ఎన్టీఆర్ యువసేన రాష్ట్ర కన్వీనర్ పంజా రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా అనాథల మధ్య కేక్ కట్‌చేసి వారికి అన్నదానం, పండ్లు పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కంచర్ల శివ, అభిమానులు శ్రీకాంత్, పోలెపాక బాలు, భరత్, శ్యామ్, బత్తిని రాజు, నర్సింగరావు, ప్రణీత్, కిరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యాన్నే తీసుకురావాలి

● జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి

ఎల్కతుర్తి : తాలు, చెత్తాచెదారం లేకుండా తూర్పార పట్టి నాణ్యమైన ధాన్యాన్నే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మూడ్రోజులుగా కొనుగోళ్లు నిలిపేసిన సందర్భంగా శనివారం ఆమె సందర్శించారు. మిల్లర్లు కుమ్మక్కై తాలు, తరుగు పేరుతో బస్తాకు నాలుగు కిలోలు కోత విధిస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో మిల్లు యజమాని గేట్‌కు తాళం వేసి ధాన్యాన్ని తీసుకోవడం లేదని అధికారులు చెప్పడంతో ఆమె స్పందించారు. ధాన్యాన్ని రాంపూర్ మిల్లుకు తరలించాలని సివిల్ సప్లయ్ అధికారులను ఆదేశించారు. ధాన్యం బస్తాలను ట్రాక్టర్లలో కాకుండా లారీల్లో తరలించాలని సూచించారు. ధాన్యానికి సరిపడ గన్నీ బ్యాగులు, టార్పాలిన్ షీట్లు అందుబాటులో ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం కోతులనడుమ గ్రామంలో విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె వెంట జిల్లా సివిల్ సప్లయ్ అధికారి (డీఎస్‌ఓ) వసంతలక్ష్మి, తహసీల్దార్ గుజ్జుల రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ తూర్పాటి సునీత, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఎంపీపీ మేకల స్వప్న, ఏపీఎం రవీందర్, సర్పంచ్ కొమ్మిడి నిరంజన్‌రెడ్డి, బోయినపల్లి రజిత, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు, ఎంపీటీసీ కొమురయ్య, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, ఏఈఓ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు

● ఫర్టిలైజర్ షాపుల్లో ఏసీపీ శ్రీనివాస్ తనిఖీ



ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న ఏసీపీ శ్రీనివాస్

ఎల్కతుర్తి : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే సంబంధిత ఫర్టిలైజర్ షాపు యజమానులపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండలంలోని సూరారం గ్రామంలోని రాజరాజేశ్వర ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ సీడ్స్ షాపును శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ వివరాలపై ఆరాతీశారు. రికార్డులను పరిశీలించారు. పత్తి విత్తనాల నిలువలు, ఎరువుల నిలువలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కాలం చెల్లిన, నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని యజమానికి తెలిపారు. ఆయన వెంట సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై పరమేష్ తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో పరిశీలన

ఎల్కతుర్తి, కోతులనడుమ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏసీపీ శ్రీనివాస్ సందర్శించి పరిశీలించారు. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే రైస్ మిల్లర్లపై చర్యలు తప్పవని చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద పోలీసుల ఫోన్ నంబర్లతో కూడిన బ్యానర్లను ఏర్పాటు చేయించారు. తరుగు పేరుతో ఇబ్బందులకు గురి చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై పరమేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా శ్రీనివాస్



కమలాపూర్ : మండలంలోని భీంపల్లి బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా బైస శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గ్రామ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎండీ.రహ్మతుల్లా, రైతు కమిటీ అధ్యక్షుడిగా కొండ మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా బోళ్ల మల్లయ్య, మహిళా కమిటీ అధ్యక్షురాలిగా కొత్తపల్లి స్వరూప రవీందర్, యువజన విభాగం అధ్యక్షుడిగా పేరబోయిన కుమార్, ఉపాధ్యక్షుడిగా అపరాది రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఆకినపెల్లి మధు, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జవ్వాజి పద్మ కుమారస్వామి, ఉపసర్పంచ్ మిల్కూరి ప్రవీణ్‌రెడ్డి, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినియోగించని వస్తువులను అందజేయండి

● మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత రామకృష్ణ



సెంటర్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

పరకాల : ఇళ్లలో వినియోగించని వృథా వస్తువులను రెడ్యూస్, రీయూజ్, రిసైక్లింగ్ (ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్లలో అందజేయాలని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ ప్రజలను కోరారు. స్థానిక 17, 18, 20వ వార్డులకు సంబంధించిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆమె, వార్డుల్లోని కేంద్రాలను సంబంధిత కౌన్సిలర్లు శనివారం ప్రారంభించారు. స్థానికులు అందించిన పనికిరాని వస్తువులను, బట్టలను సేకరించి సెంటర్ బాధ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అనిత మాట్లాడారు. వినియోగంలో లేని బట్టలు, బకెట్లు, తదితరాలను అందజేస్తే వాటిని పేదలకు అందజేస్తారని తెలిపారు. ఎవరికీ ఉపయోగపడని వస్తువులుంటే రీసైక్లింగ్ చేయొచ్చని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి, ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ఇన్‌చార్జ్ తిరుపతి, మెప్మా ఆర్పీలు ఉమ, జ్యోతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో సంకీర్తన



శాయంపేట : మండలంలోని సూరంపేట గ్రామానికి చెందిన శ్రీరామదాసు భజన మండలి నిర్వాహకులు తిరుమల తిరుపతి దేవస్థానంలో శనివారం హరినామ సంకీర్తన నిర్వహించారు. ఉదయం, రాత్రివేళల్లో 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షుడు మర్యాల రాంరెడ్డి, సభ్యులు సాయిరెడ్డి, రఘుపతి, రాజు, రాజయ్య, కిష్టయ్య, వెంకటేష్, రవిచంద్ర, శ్రీకాంత్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బీమాను వినియోగించుకోవాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న సర్పంచ్ రవి

శాయంపేట : తపాల శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పోస్టల్ బీమాను 18 ఏళ్లకుపైబడిన ప్రజలు వినియోగించుకోవాలని సర్పంచ్ కందగట్ల రవి కోరారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పోస్టల్ శాఖ ఏర్పాటు చేసిన క్యాంప్‌లో సదరు బీమా కరపత్రాలను సర్పంచ్ రవి శనివారం విడుదల చేసి మాట్లాడారు. పోస్టల్ బీమా వల్ల కుటుంబాలకు భద్రత లభిస్తుందన్నారు. తొలుత పోస్టల్ పేమెంట్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడారు. పోస్టాఫీస్‌లో రూ.200 నగదుతో సేవింగ్స్ ఖాతా తీసుకొని రూ.399లు చెల్లించి రూ.10 లక్షల బీమా సదుపాయాన్ని పొందవచ్చని తెలిపారు. సేవింగ్ ఖాతాను ఉపాధి హామీ కూలీ డబ్బులు, రైతుబంధు, ప్రధాన మంత్రి కిసాన్, విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఆసరా పింఛన్ల కోసం ఉపయోగించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ పాల్గొన్నారు.

బీమా డబ్బుల పంపిణీ




ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలోని శ్రీషిరిడీ సాయి పురుషుల పొదుపు సంఘం సభ్యులు దామెరగిద్ద వీరయ్య, సింగారపు మల్లయ్య, మాదాసి వెంకటయ్య ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందగా వారి నామినీలకు సంఘం కార్యాలయంలో బీమా డబ్బులను అధ్యక్షుడు కాత వీరస్వామి శనివారం పంపిణీ చేశారు. అనంతరం వీరస్వామి మాట్లాడారు. మల్లయ్య, వీరయ్యల నామినీలకు రూ.70 వేలు చొప్పున, వెంకటయ్య భార్యకు రూ.10 వేలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు బిల్లా అమరేందర్‌రెడ్డి, సంఘ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

‘మల్లన్న’ ధర్మకర్తకు పరామర్శ



ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయ ధర్మకర్త బొల్లేపల్లి వెంకటేశ్వర్లును డీసీసీబీ చైర్మన్, ఆలయ పెద్దరథం నిర్వాహకుడు మార్నేని రవీందర్‌రావు పరామర్శించారు. వెంకటేశ్వర్లు తల్లి బొల్లేపల్లి వజ్రమ్మ(85) అనారోగ్య కారణాలతో శనివారం మృతి చెందింది. ఈ క్రమంలో ఆమె మృతదేహానికి మార్నేని రవీందర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వజ్రమ్మ కొడుకులైన వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, తిరుపతిలను ఓదార్చారు. చైర్మన్ రవీందర్‌రావు వెంట ఆలయ మాజీ చైర్మన్‌లు మునిగాల సంపత్ కుమార్, వడిచర్ల శ్రీనివాస్, ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఉప సర్పంచ్ అద్దగూడి సతీష్‌కుమార్ ఉన్నారు.

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌కు..



శాయంపేట : తెలంగాణ భాషా సాంస్కృతి శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణను అతడి తండ్రి సుదర్శన్ మృతి చెందిన క్రమంలో కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. తొలుత సుదర్శన్ మృతదేహానికి సత్యనారాయణరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిందం రవి, మారెపల్లి కట్టయ్య, సాదు నాగరాజు, రమేష్, రాజు, సంతోష్ తదితరులున్నారు.

ఉద్యమకారుడి కుటుంబానికి..

ఆత్మకూరు : మండలంలోని గూడెప్పాడ్ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు మహ్మద్ అంకూస్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు శనివారం పరామర్శించారు. అంకూస్ మృతి బాధాకరమన్నారు. అంకూస్ కుటుంబసభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు బాబుమియా, నాయకులు లింగన్న, లక్ష్మారెడ్డి, నర్సయ్య, ఇమాన్యుయెల్ పాల్గొన్నారు.

నడికూడలో..



నడికూడ : మండల కేంద్రానికి చెందిన గోనెల అశోక్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని తెలంగాణ రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు శనివారం పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం అందించారు. అశోక్ మృతి బాధాకరమన్నారు. అశోక్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘం రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు, ఆరె సంఘం జిల్లా కార్యదర్శి నాగుర్ల సంతోష్, నాయకులు లోకటి నగేష్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

దళితుల హక్కులను కాపాడుకుందాం

ఖిలా వరంగల్: దళితుల హక్కులను కాపాడుకుందామని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు సంగి ఎలేందర్, సభ్యుడు గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో తాళ్లపల్లి జాన్‌పాల్, సుధీర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దళిత సమస్యలపై కలిసి పోరాడుదామని సూచించారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజు, కార్యదర్శిగా రాజేందర్, వరంగల్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా దేవరాజ్, శంకర్ ఎన్నికయ్యారు.

ఓటరు జాబితాపై సమీక్ష



పరకాల : ఈ ఏడాది చివరలో సాధారణ ఎన్నికలు జరుగనున్న క్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా, ఇతర సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు పలు సూచనలు చేశారు. ఒకే కుటుంబానికి చెందిన ఓట్లన్నీ ఒకే పోలింగ్ బూత్‌ల్లో ఉండేలా చూడాలని రెవెన్యూ అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఉమాదేవి, రవీందర్‌రావు, బీఆర్‌ఎస్, బీజేపీ పట్టణ అధ్యక్షులు మడికొండ శ్రీను, మార్త భిక్షపతి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడి దాదాగిరి

చెంప చెళ్లుమనిపించిన మహిళా వీఓఏ

● నిలిచిపోయిన ధాన్యం కొనుగోళ్లు

● ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ చొరవ తీసుకోవాలి : రైతులు



కొనుగోలు కేంద్రం వద్ద వాగ్వాదం చేస్తున్న రఘుసింగ్, అతడి అనుచరులు

శాయంపేట : బీఆర్‌ఎస్ నాయకుడు దాదాగిరీకి పాల్పడడంతో మహిళా వీఓఏ అతడి చెంపు చెల్లుమనిపించింది. ఈ క్రమంలో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. వర్షం కురిస్తే ధాన్యం తడిచి నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. మండలంలో శనివారం చోటు చేసుకున్న ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. వివరాలిలా..

మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వం చైతన్య భారతి మహిళా సంఘానికి అప్పగించింది. ఈ క్రమంలో అక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్న వీఓఏ పిట్టల మాధవి, మహిళా సంఘం సభ్యులు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు శనివారం ఏర్పాట్లు పూర్తి చేశారు. కొనుగోళ్లు ప్రారంభించే సమయంలోనే బీఆర్‌ఎస్ నేత, ఎంపీటీసీ ఉమ భర్త రఘుసింగ్ అనుచరులతో కలిసి అక్కడకు చేరుకుని తన భార్య సభ్యురాలిగా ఉన్న జ్యోతి మహిళా సంఘానికి కొనుగోలు కేంద్రం బాధ్యతలు ఇవ్వాలంటూ వాగ్వాదానికి దిగాడు. వీఓఏ మాధవిని అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో వీఓఏ మాధవి అసహనానికి గురై బీఆర్‌ఎస్ నేత రఘుసింగ్ చెంప చెల్లుమనిపించింది. అనంతరం తీవ్ర ఆగ్రహానికి గురైన రఘుసింగ్ వీవోఏ మాధవిని చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న కాంటాను అనుచరులతో కలిసి రఘుసింగ్ తీసుకెళ్లారు. కొనుగోలు కేంద్రం ప్రారంభం నిలిచిపోయింది. కొనుగోళ్లు నిలిచిపోయిన క్రమంలో వర్షం కురిస్తే ధాన్యం పాడవుతుందని రైతులు ఆందోళనకు గురౌతున్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి చొరవ తీసుకొని కొనుగోళ్లు ప్రారంభించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

చెరువు కట్టను అభివృద్ధి చేయాలి

● జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్



చెరువు కట్టను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ గ్రామంలోని పెద్ద చెరువుకు రివిట్‌మెంట్‌తోపాటు చెరువు కట్టను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీఓ) ఎ.శ్రీనివాస్‌కుమార్ సూచించారు. మండలంలో శనివారం ఆయన పర్యటించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరుగుతున్న మిషన్ లైఫ్ కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం ఉప్పల్ గ్రామ పంచాయతీని ఆకస్మికంగా సందర్శించారు. గ్రామ పంచాయతీ పరిధిలో అమృత్ సరోవర్ పథకం కింద ఈజీఎస్ నిధులతో అభివృద్ధి చేసిన పెద్ద చెరువును చేరుకుని పరిశీలించారు. పెద్ద చెరువు ఆయకట్టు కింద ఉన్న రైతులతో మాట్లాడి చెరువును అభివృద్ధి చేయడం ద్వారా కలిగిన లాభాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పల్లవి, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి పాక శ్రీనివాస్, సర్పంచ్ దేవేందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏపీఓ రమేష్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కమలాపూర్ : పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా ఎంపీపీ తడక రాణి శ్రీకాంత్ అభివర్ణించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించనున్న క్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు మండలంలోని ఉప్పల్, శంభునిపల్లి గ్రామాల్లో ముందస్తుగా ‘మిషన్ లైఫ్’ పేరుతో ప్రత్యేక గ్రామసభలు శనివారం నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాణి మాట్లాడారు. పర్యావరణాన్ని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే పనులు చేయొద్దని సూచించారు. ప్రతిఒక్కరూ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణపై మహిళా సంఘాల సభ్యులు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీడీఓ పల్లవి మాట్లాడుతూ జూన్ 5 వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో రోజు వారీగా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. పర్యావరణాన్ని పరిరక్షణకు ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలని ఆకాంక్షించారు. సర్పంచ్ పెండ్యాల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని మానేయాలని, స్టీల్ పాత్రలనే వినియోగించాలని సూచించారు. టీ, కాఫీలను పేపర్ కప్పుల్లో తాగవద్దని స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ దేవేందర్‌రావు, ఏపీఓ రమేష్, ఈసీ కార్తీక్, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ‘సమ్మేళనాలు’

● స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే టి.రాజయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

ధర్మసాగర్ : రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించేలా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య తెలిపారు. మండలంలోని కరుణాపురం క్లస్టర్‌లో ఈనెల 28న నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. హనుమకొండలోని తన క్యాంప్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు మునిగెల రాజు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే రాజయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో మొదటి విడత బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు విజయవంతంగా నిర్వహిస్తూ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపుతున్నట్లు తెలిపారు. సమ్మేళనానికి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ హాజరు కావాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ నిమ్మ కవిత, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డు ప్రభుదాస్, కీర్తి వెంకటేశ్వర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు నిర్మాణ పనుల తనిఖీ



మెటీరియల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం నుంచి పత్తిపాక, శాయంపేట మీదుగా మాందారిపేట వరకు చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులను నేషనల్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. నేషనల్ క్వాలిటీ మానిటర్ రామ్ అవతార్ శర్మ ఆధ్వర్యంలోని బృందం బీటీ రోడ్డును పరికరాలతో తవ్వి ఎంత మోతాదులో నాణ్యమైన మెటీరియల్ వినియోగించారో పరీక్షించారు. ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని అధికారులు తెలిపారు. నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ లింగారెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారులు పాల్గొన్నారు.